'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ప్రశ్నిస్తే అక్కసు

**ఎడాపెడా** హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలకు ఆ హామీలను అమలు చేయండంటే ఎందుకో అలవిమాలిన ఉక్రోషం వస్తున్నది. ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలనే ఆత్రంలో అమలు చేయలేని హామీలు ఇచ్చారా? లేక అధికారంలోకి వచ్చాక చేస్తే ఏమిటి? చేయకపోతే ఏమిటి? అని అనుకుంటున్నారా? అనేది వారికే తెలియాలి. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలంటే ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ ఏ మూలకూ సరిపోదని విజ్ఞులు ఇదివరకే లెక్కతేల్చారు. కొత్త హామీల సంగతి అలా ఉంచి, నిన్నటిదాకా సజావుగా అమలైన రైతుబంధు వంటివాటిని కొత్త ప్రభుత్వం ఏం చేయాలనుకుంటున్నదో అర్థం కావడం లేదు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజల తరపున ప్రశ్నలు వేస్తే కాంగ్రెస్ నేతలు ఉలిక్కిపడుతున్నారు. 'బీఆర్ఎస్‌ను బొందపెడుతాం' అంటూ అంతెత్తు ఎగురుతున్నారు. బీఆర్ఎస్‌ను బొందపెడుతాం అని హుంకరించడం దేనికి? హామీలు అమలు చేస్తే చాలు కదా!

ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా ఉంది కాంగ్రెస్ తీరు. నిలదీస్తే కలబడేందుకు తెగిస్తున్నది. మరీ ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉన్నది. ఆయన ఉపయోగిస్తున్న భాష సీఎం స్థాయికి, హోదాకు తగ్గట్టుగా ఉండటం లేదు. తెలంగాణ సాధించిన నేత కేసీఆర్. తెలంగాణను సమున్నతంగా నిలబెట్టిన దార్శనికుడాయన. ప్రజలు రెండు విడతలు ఆయన చేతికే పగ్గాలు ఇచ్చారన్న సంగతి మరిచిపోతే ఎలా? కాంగ్రెస్‌ను మూలకు పెట్టింది కూడా ఆ ప్రజలే కదా! మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బలమైన ప్రతిపక్షంగా నిలబెట్టిందీ వారే. స్వరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిపై, ఆయన నేతృత్వంలోని బీఆర్ఎస్‌పై ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఇష్టం వచ్చినట్టుగా, అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం సంస్కారం అనిపించుకోదు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉండదని, వంద అడుగుల లోతులో పాతిపెడుతామని హుంకరించడం ఎందుకు? పరిపాలన అంటే విపక్షాన్ని తిడుతూ కూర్చోవడమేనా? విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడైనా హుందాగా వ్యవహరించాలన్న సోయి మరిచి అక్కసుతో తిక్కమాటలు మాట్లాడటాన్ని గమనిస్తే బీఆర్ఎస్ పేరెత్తితేనే కాంగ్రెస్ నేతలకు జడుపు జ్వరం కలుగుతున్నదా! అని అనిపిస్తున్నది.

'రైతుబంధు పెట్టుబడి సాయం ఇంకా అందలేదన్నోళ్లను చెప్పుతో కొట్టండి' అని మంత్రి కోమటిరెడ్డి దుర్భాషలాడటం నిస్పృహకు సంకేతం! 'బీఆర్ఎస్‌ను 14 ముక్కలు చేస్తం.. మేం తలచుకుంటే ఆ పార్టీ ఎమ్మెల్యేలను 39 ముక్కలు చేస్తాం' అని మరో సందర్భంలో అదే మంత్రి ఎగిరెగిరి పడటం ఆయనలోని భయాన్ని, అరాచకత్వాన్ని సూచిస్తున్నది. ఈ ధోరణి ఇంకాస్త పెచ్చరిల్లి బీఆర్ఎస్ నేతలపై, కార్యకర్తలపై దాడులకు దారితీస్తున్నది. తాజాగా అదే మంత్రి పాల్గొన్న ఓ అధికారిక కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీ చైర్మన్‌పై దాడి జరగడం, పోలీసుల సాయంతో ఆయనను బయటికి గెంటించడం నకారాత్మక ధోరణికి పరాకాష్ఠ. మరోవైపు కేసులు, విచారణల పేరిట బెదిరించడమూ జరుగుతున్నది. బట్టకాల్చి మీదేసినట్టు బీఆర్ఎస్‌పై అడ్డగోలు ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చారు. ప్రజలు బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌కు ఓ అవకాశం ఇచ్చారు. ఏదైనా చేసి చూపితే బాగుంటుంది. అంతే తప్ప బీఆర్ఎస్ మీద ఇంకా బురద జల్లుతూ కూర్చుంటామంటే కుదరదు. ఇప్పుడు తాము అధికారంలో ఉన్నామని కాంగ్రెస్ ముఖ్యులు గుర్తించాలి. ఆరోపణలు, భౌతికదాడులకు బదులు ఇప్పటికైనా ఇచ్చిన హామీల అమలుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకొని, పటిష్ఠమైన ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగడం మంచిది.

---



తెలంగాణ తొలి గేయ రచయిత, సాయుధ పోరాట యోధుడు రావెళ్ల వెంకట రామారావు. ఒక చేత తుపాకీతో సాయుధ పోరాటం చేస్తూ, మరోచేత కలంపట్టి నిజాం వ్యతిరేక రచనలు సాగించిన సవ్యసాచి.

(నేడు రావెళ్ల వెంకట రామారావు జయంతి)

## తెలంగాణ ఉద్యమ తొలి గేయ రచయిత రావెళ్ల


భూమి కోసం, భుక్తి కోసం, నిజాం రాచరిక పాలన అంతం కోసం తుపాకీ పట్టి దళకమాండర్‌గా పని చేసి ప్రత్యర్థులను గడగడలాడించిన ధీశాలి ఆయన. 1960లో 'జీవనరాగం' అనే ఖండకావ్యంలో రావెళ్ల రాసిన 'మాతృగీతిక' పాట..

> 'కదనాన శత్రువుల కుత్తుకల నవలీల
> నుత్తరించిన బలోన్మత్తు లేలిన భూమి
> వీరులకు కాణాచిరా తెలగాణ
> ధీరులకు మొగసాలరా'

పోరాట గీతమై నిలిచింది. రావెళ్ల ఉద్వేగ స్వరంనుంచి వెలువడిన ఈ గేయం 1969 తొలిదశ ఉద్యమంలో లక్షలాది హృదయాల్లో ప్రతిధ్వనించింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఈ పాట గొప్పదనాన్ని ఆచార్య జయశంకర్ వివరించేవారు. ప్రముఖ గాయకుడు దేశపతి శ్రీనివాస్ వేలాది సభల్లో పాడి ఉద్యమానికి కొత్తశక్తిని అందించారు.

ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, గోకినేపల్లిలో 1927 జనవరి 31న రావెళ్ల జన్మించారు. విద్యార్థిదశలోనే 1944లో ఆంధ్ర మహాసభలో చేరిన రావెళ్ల, ఆనాటి రజాకార్ల దమన కాండను చూసి గన్నునూ, పెన్నునూ ఆయుధాలుగా వాడుకొంటూ సమరరంలో పాల్గొన్నారు. నాటి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, నవ భారత, స్వతంత్ర భారత పత్రికలలో అభ్యుదయ, జానపద శైలిలో రచనలకు శ్రీకారం చుట్టారు. ఢిల్లీ కేంద్ర కారాగారంలో ప్రముఖ కమ్యూనిస్టు నేత ఇంద్రజిత్ గుప్తా, మణిపూర్ మాజీ సీఎం దశరథ్ దేవ్ తదితరులు రావెళ్లకు సహచరులుగా ఉన్నారు.

1947లో జయశ్రీ అనే కలం పేరుతో తొలుత రచనలు మొదలు పెట్టిన రావెళ్ల అనంతరం పురాతన్, క్రిషిక్, తెలంగాణ్యుడు, ఆర్.వి.ఆర్. అనే పేర్లతో ఎన్నో రచనలు చేశారు. తన ఇంటినే ఓ కవితా కుటీరంగా మలుచుకున్నారు. రాగజ్యోతులు (గేయసంపుటి), జీవనరాగం (ఖండకావ్యం) నవ ప్రచురణలు (కవిత్వం), అనలతల్పపు (గేయకవిత్వం), పల్లెభారతి (పాటలు), తాండవహేల (శివస్తవ రూపక కావ్యం) రచనలు చేశారు. రావెళ్ల చేసిన సాహిత్యసేవకు గుర్తింపుగా గురజాడ సాహితీ అవార్డ్, దాశరథి సాహితీ పురస్కారం, జాషువా సాహితీ అవార్డులు పొందారు. పోరాటాన్నే ఊపిరిగా మలచుకుని ప్రజల కోసం జీవించిన రావెళ్ల 2013 డిసెంబర్ 10న తనువు చాలించారు.



సాయి లోహిత పులపా

---

# ప్రజాబలంతోనే నేతల మనుగడ

మేఘాల తీరు చూసి వాన ఎంతసేపు కురుస్తుందో పల్లెలోని సామాన్యుడు కూడా చెప్పగలడు. ఒక్క మెతుకు చూస్తే అన్నం ఎంత ఉడికిందో తెలుస్తుంది. ఇవన్నీ ప్రకృతి సహజమైన కార్యాలు కనుక ఎప్పటికీ మారవు. కానీ, రాజకీయాలు అట్లా ఉండవు. ఊహించలేని విషయాలు కండ్లముందు జరుగుతాయి. క్షణక్షణం మారగలిగిన ప్రజ్ఞ ఉన్న మనిషిని బట్టి అవి సామాన్యులు తెలుసుకోలేని విధంగా రోజురోజుకు మారుతూ ఉంటాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో అటువంటి అనూహ్య పరిస్థితి నెలకొంది.



కనకదుర్గ దంటు
89772 43484



రెండుసార్లు గెలిచిన ఉద్యమ పార్టీ నాయకుడు ముఖ్యమంత్రి పదవిని చేపట్టి, అర్ధ శతాబ్దం అష్టకష్టాలు పడ్డ ప్రజలను ఎంతో సమర్థవంతంగా పరిపాలించి, రాష్ట్రాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. అయితే డా.జయశంకర్ సార్ చెప్పినట్టు 'తెలంగాణ వంటి సుసంపన్న రాష్ట్రాన్ని వలస పాలకులు అంత త్వరగా వదులుకోరు. అయితే మళ్లీ ఉమ్మడి రాష్ట్రం చేయడానికి ప్రయత్నిస్తారు. లేకపోతే ఈ రాష్ట్ర ప్రగతికి అడ్డుపడి, సర్వనాశనం చేయటానికైనా వెనుకాడరు' అన్న ఆయన మాటలు ఇప్పుడు గుర్తుతెచ్చుకోవాలి.

కేవలం తొమ్మిదిన్నరేండ్లలో అనూహ్య ప్రగతి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని ఏ వలస పాలకుడు, ఏ ఆంధ్రా పార్టీ వదలదని చాలా సంఘటనలు చెప్పాయి. విడిపోయాక కూడా తెలంగాణ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ, తెలుగుదేశం, జనసేన, ఆఖరికి రాజకీయ అనుభవం లేని కేఏ పాల్, షర్మిల వంటివారు కూడా తమ పార్టీలని ఇక్కడే స్థాపించాలని చూడటం గమనిస్తే వీరందరూ తెలంగాణ ప్రజలని ఎంత తక్కువగా పరిగణిస్తారో అర్థమవుతుంది. జాతీయ పార్టీ కాంగ్రెస్ తోక పుచ్చుకొని 2018 ఎన్నికల్లో టీడీపీ ఇక్కడ మళ్లీ తన బలం పెంచుకోవాలని ప్రయత్నించి బొక్కబోర్లా పడింది. ఇక ఆంధ్రా ప్రాంతంలో దూషణ సత్కారాలు, అవహేళనలు ఎదుర్కొంటున్న పవన్ కల్యాణ్ బీజేపీ జేబులో దూరి ఇక్కడా పాగా వేయాలని సాహసం చేశారు. ఆఖరికి ఆయన పార్టీ తరపున తాజా ఎన్నికల్లో పోటీ చేసిన 8 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోవడమే కాదు, ఏ ఒక్కరికీ బర్రె లక్కకు వచ్చినన్ని ఓట్లు కూడా రాకపోవడంలో ఆశ్చర్యమేముంది? ఆత్మగౌరవం కలిగిన వారు ఎవరైనా అయితే, తట్టాబుట్టా సర్దుకొనేవారే. ఎప్పుడు, ఎక్కడ ఉంటారో ఎవరికీ తెలియదు, కనుక ఈయనతో తెలంగాణకు ప్రమాదం లేదు. ఇక రాజన్న బిడ్డ మెట్టినింటిలో తెలంగాణ అత్తగారి దగ్గర తన పాచికలు పారక, ఇక్కడ తనని నమ్మి రోడ్ల మీదకు వచ్చిన వారినందరినీ నట్టేట్లో ముంచి, జెండా పీకేసి, పుట్టినింటికి తరలిపోయారు. అక్కడ అన్నతో యుద్ధానికి అమ్మతో కలిసి సిద్ధమయ్యారు. కనుక, ఈపై పార్టీల వారెవరికీ తెలంగాణలో లాభమూ లేదు, నష్టమూ లేదు!

మరి ఇప్పుడు ఎవరు తమ భవిష్యత్తు గురించి ఆలోచించుకోవాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలు శాశ్వతం, నాయకులు అశాశ్వతం. ఈ కఠోర సత్యాన్ని గుర్తించనివారు రాజకీయాల్లో ఎక్కువకాలం మనలేరు. కానీ, ప్రజాభిమానాన్ని చూరగొన్నవారే ఎక్కువ ప్రభావం చూపగలరు. 2014 దాకా స్థానిక పార్టీ అనేది అధికారంలో లేక అష్టకష్టాలు పడ్డ తెలంగాణ ప్రజలకు అప్పటి టీఆర్ఎస్, ఇప్పటి బీఆర్ఎస్ అండగా నిలిచి రక్షించింది. అసలు పాలన అంటే ఏమిటో రుచి చూపించింది. ప్రజాపాలన పేరుతో తమ స్వార్థం చూసుకుంటూ, అవినీతితో అంటకాగుతూ ప్రజలను గాలికి వదిలేయటం కాదనీ, వారి అవసరాలను క్షుణ్ణంగా గమనించి వారు అడగకముందే సహాయం చేయటమనీ రాజకీయాల్లోనే ఒక కొత్త పంథాను దేశానికి నిర్దేశించింది. నిజానికి రెండు జాతీయ పార్టీల 75 ఏండ్ల అవకతవకల పాలనలో విసిగిపోయిన ప్రజలు ఇతర రాష్ట్రాల్లో కూడా తమ తమ ప్రాంతీయ పార్టీలకే పట్టం కడుతున్నారు. అదే జరగాలి కూడా!

ఇక ఇప్పుడు తమకు తామే విస్తుపోయేంతగా అనూహ్యంగా, అసందర్భంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి రెండు కష్టాలు దురదృష్టంగా మారాయి. ఒకటి- ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి అవగాహనారాహిత్యం, రెండు- పాలనా అనుభవ రాహిత్యం. అటు ప్రజల అవసరాల గురించి అవగాహన లేక, ఇటు రాష్ట్ర పాలన ఎలా ప్రణాళికాబద్ధంగా ఉంటుందో తెలియక అలవిగాని పథకాలు ఇస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చేశారు. అధికారంలోకి వచ్చాక గానీ సమస్య తెలిసిరాలేదు. ఇక మాట నిలబెట్టుకోలేక పథకాల గురించి అడిగిన ప్రజలను దుర్భాషలాడుతున్నారు.

> ఇక్కడ ఆ పార్టీలో ఇప్పుడిప్పుడే చేరి, ఇంకో పదో, ఇరవై ఏండ్లో రాజకీయాల్లో ఉండాలని ఆశించే ఈ తరం నాయకులు, వారి కార్యకర్తలు పై పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఇప్పుడు నిజమైన ప్రమాదం వీరికే పొంచి ఉంది. ఇది వరకు పడ్డట్టే ఈ కాంగ్రెస్ పార్టీ పాలనలో అంతులేని కష్టాలు పడే ప్రజలు ఐదేండ్ల తర్వాత బయటపడతారు. అనుభవాన్ని తలచుకొని మళ్లీ స్థానిక పార్టీని తలకెత్తుకుంటారు.

అప్పుడేమవుతుంది? ఐదేండ్లు ప్రజాగ్రహాన్ని చూసిన ఈ కాంగ్రెస్ నాయకులకు, వారి అనుయాయులకి ఇంక రాజకీయ భవిష్యత్తు ఉండదు. లేదా ఇప్పటి ముఖ్యమంత్రితో సహా అందరూ బీజేపీలోకి దూకినా ఆ పార్టీకి కూడా తెలంగాణలో స్థానం ఉండదు. ప్రస్తుతం ఆ రెండు పార్టీలూ బలంగా కనిపించినా, క్రమంగా తెరమరుగు అవుతాయి. ఇంకొక విషయం ముఖ్యంగా ఆలోచించవలసింది ఉన్నది. ఒకే వ్యక్తి, నాయకుడి మీద ఆధారపడ్డ పార్టీలు ఆ నాయకుడితోనే అంతరిస్తాయి, ఇప్పుడు తెలుగుదేశం లాగా. కనుక ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీలో ఉన్న ఈ తరం రాజకీయ నాయకులు తమ భవిష్యత్తు గురించి బాగా ఆలోచించుకొని అడుగేయాలి. ప్రజలను తక్కువగా అంచనా వేయవద్దు. వారి అభిమానాన్ని సంపాదించకపోతే 2014లో రాష్ట్రాన్ని ఏర్పరచినా కూడా కాంగ్రెస్ ఎదుర్కొన్న పరాభవాన్ని గుర్తుంచుకోవాలి. నాయకులకి ధనబలం, అంగబలం కంటే ప్రజా బలం ముఖ్యం. ప్రజా బలం నశించినప్పుడు అంగ బలం మిగలదు, ధన బలం పని చేయదు. జాగ్రత్త! జై తెలంగాణ!!

---

# సంవిధానం దారి ఎటు?

'ఇండియా దటీజ్ భారత్' అనే వాక్యంతో మన సంవిధానంలోని తొలి అధికరణం ఆరంభమవుతుంది. 'ఇండియా అంటే భారత్ రాష్ట్రాల సంఘమై ఉంటుంది' అని అందులో స్పష్టంగా ఉంటుంది.

బ్రిటిష్ ఇండియాలోని తొమ్మిది ప్రావిన్స్‌లు, స్వతంత్ర రాజ్యాలు, కేంద్రపాలనలో ఉన్న అయిదు రాష్ట్రాలు, అండమాన్ నికోబార్ దీవులు, వాటి పరిధుల గురించి అందులో వివరించారు. ఆ తర్వాతి కాలంలో రాష్ట్రాలను భాషాప్రాతిపదికన పునర్నిర్మించారు. 1950 జనవరి 26 నుంచి మన రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. ఇటీవల మనం గణతంత్ర రాజ్యంగా ఏర్పడి 74 వసంతాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా సంబురాలు చేసుకున్నాం. 75వ వసంతం వైపునకు పరుగులు పెడుతున్నాం. ఈ సందర్భంగా మన దేశంలో ఉండీ, లేనట్టు.. ఉందా? లేదా? అని ఊగిసలాడుతున్న 'గణతంత్ర' గురించి ఒకసారి చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



మాడభూషి శ్రీధర్

మన భారతం స్వాతంత్ర్య అమృతోత్సవ సంవత్సరాన్ని దాటిపోయిన సందర్భం ఇది. మాయమాటలకు, పనికిరాని ఉచిత కానుకల వాగ్దానాలకు లొంగిపోయి ఐదేండ్ల ఆధిపత్యపు లైసెన్సులను ఓటర్లు సారా చిత్తులో, మతం మత్తులో, ధనం గమ్మత్తులో, ఫేక్ న్యూస్ విజృంభించే వాట్సాప్ గ్రూపుల విపత్తులో పడిపోయి ఓట్ల రూపంలో సమర్పించుకుంటున్న దశ ఇది. 74 ఏండ్లు గణతంత్ర ఫలాలను చవిచూచిన జాతి, దాదాపు ఆ మహాత్యాగాలను, విషమ పోరాట విషయాల్ని మర్చిపోయింది.

రాజ్యాంగం అమల్లోకి వచ్చిన మొదటి మూడు దశాబ్దాలు వివిధ రాజకీయ పార్టీల్లో సేవా దృక్పథం కలవారు, రాజకీయాలను పూర్తికాలపు వృత్తిగా స్వీకరించినవారు పోటీ చేసి ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యేవారు. కానీ, ఆర్థిక సంస్కరణల తర్వాత రాజకీయాలు కార్పొరేటీకరణ చెంది, ప్రధాన రాజకీయ పార్టీల్లో కార్పొరేట్ ప్రతినిధులు, వ్యాపారవేత్తలు చేరి ప్రజా ప్రతినిధులుగా పోటీ చేస్తున్నారు. లోక్‌సభకు రూ.100 కోట్లు, శాసనసభకు రూ.25 కోట్లకు పైగా ఖర్చు చేసేవారు మాత్రమే పోటీ చేయాలని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. గెలుపొందిన వారు వ్యాపారం చేసుకుంటూ తమ పదవిని వ్యాపార ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారు. దీని వల్ల నిజాయితీపరులు, సామాజికవేత్తలు, వామపక్ష ప్రజా దృక్పథం కలిగిన వారు ఎన్నికల్లో పోటీ చేయలేకపోతున్నారు.

> భారతదేశంలో రాజ్యాంగమే సర్వోన్నతమైనది. అన్ని వ్యవస్థలు, సంస్థలు కూడా రాజ్యాంగానికి అనుగుణంగా పని చేయాలి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1949 నవంబర్ 26న కింది విధంగా పేర్కొన్నారు. 'ఒక రాజ్యాంగం ఎంత మంచిదైనా, గొప్పదైనా కావచ్చు, కానీ దాన్ని అమలు చేసేవాళ్లు చెడ్డ వాళ్లయితే అది పనిచేయదు' అని చెప్పారు.

పంద్రాగస్టు నాడు జెండా ఎగరేయడానికి తీరిక చేసుకునే వారికన్నా, జెండా ఎగరేసి నమస్తే పెట్టని వాడెవడో చూసి తీరిగ్గా తన్నేవారు ఎక్కువై, రకరకాల దేశభక్తులు చెలరేగుతున్న అమృత ఘడియలు ఇవి. భారత రాజ్యాంగం చెక్కుచెదరకుండా ఉన్నట్టే ఉంది గానీ, ఆదేశిక సూత్రాలు గాలిలో తేలిపోతున్నాయి. సుపరిపాలన సుడిగాలిలో కొట్టుకుపోతున్నది. పార్లమెంట్ నేల నుంచి సౌత్ బ్లాక్, నార్త్ బ్లాక్ దాటి రాష్ట్రపతి భవనం గేటుకు కొట్టుకుని, ఇటు కిందికి కన్యాకుమారి దాకా సంవిధాన నీతి పవనాలు వీచడం లేదు. పెగాసస్ గందరగోళంలో పడి ప్రతిపక్షం గడబిడలో ఉంటే బిల్లులు మాత్రం లోకసభ చిల్లుల్లోంచి బయటపడి చట్టాలవుతున్నాయి.

> రణరంగం కానిచోటు భూస్థలమంతా వెదికిన దొరకదు
> గతమంతా తడిసె రక్తమున, కాకుంటే కన్నీళ్లతో
> చల్లారిన సంసారాలూ మరణించిన జనసందోహం
> అసహాయుల హాహాకారం చరిత్రలో నిరూపించినవి
> ఈ నేరగాళ్ల గురించే శ్రీశ్రీ ఇదే రాస్తున్నాడనిపిస్తుంది కదూ.

నేరగాళ్లు నిండిన చట్టసభల గొంగట్లో సమన్యాయ విలువల కోసం మనం వెతుక్కుంటున్నాం. సీజేఐ అంటే భారత ప్రధాన న్యాయమూర్తి మీద లైంగిక వేధింపుల ఫిర్యాదు చేసిన మహిళపైనా, ఆమె బంధువులపైనా పెగాసస్ నిఘా పెట్టి కోర్టు ధిక్కారం కాకుండా న్యాయవ్యవస్థ పరువును జాగ్రత్తగా కాపాడుకున్నాం. దుశ్శాసన సభలో ద్రౌపదీ వస్త్రాపహరణం కాదు. సర్వోన్నత ధర్మాసన వాకిట్లో న్యాయానికి మానహాని. తర్వాత న్యాయం రాజ్యసభలో ప్రవేశించింది. సభాధ్యక్షుడి కంట కన్నీరై ప్రవహించింది. కోట్ల రూపాయలు చెల్లించి మరీ నిఘా సమాచారాన్ని కొన్నవారికి ఎన్నివేల కోట్ల రూపాయల ప్రయోజనాలో అనడిగితే రాజద్రోహమేనంటారా?

ప్రైవసీ అనేది ప్రాథమిక హక్కుల సమాహారం అని నవ న్యాయమూర్తిత్వ ధర్మాసనం తీర్పు పౌరహక్కుల్లో సరికొత్త చారిత్రాత్మక విప్లవం అని సంతోషించారే గానీ, అంతటి ప్రైవసీని జాతీయ స్థాయిలో ఒక విదేశీ కార్పొరేట్ శక్తి టోకున బలి చేస్తే, రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టడమే మా రాజకీయం అని చాటుకుంటుంటే ప్రైవసీ నాశనం అయిందని సంతాప సభలైనా పెట్టారా? బ్రిటిష్ జడ్జి మన మహాత్మాగాంధీ మీద రాజద్రోహం కేసులో శిక్ష వేయవలసి వస్తున్నందుకు బాధపడ్డారట. వేలాది మంది భారతీయుల మీద మన సొంత భారతీయ ప్రభుత్వం 98 శాతం నకిలీ రాజద్రోహం కేసులు పెట్టినందుకు సిగ్గుపడే అర్హతైనా ఉందా? బ్రిటిష్ వాడు కూడా అచ్చెరువందే విధంగా ఆనాటి అరాచకపు దుర్మార్గ చట్టాలను నిస్సిగ్గుగా వాడుకుంటున్నామే. పాపం ఏడీఆర్ లెక్కలు వేయడానికి తప్ప లక్షల మంది అభ్యర్థుల ప్రమాణ పత్రాల వల్ల ఏం ప్రయోజనం? ఓటర్లకు అభ్యర్థుల గురించి తెలుసుకునే హక్కు ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన తర్వాత ప్రతి నేరగాడూ, సారీ... ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థీ తన నేరాల చిట్టాలు, స్థిరచరాస్తులు నోట్ల కట్టల కొట్టాలు, చదువుకొన్న (కొనని) పట్టాల వివరాలతో ఇచ్చిన ప్రమాణ పత్రాలు అట్లా పడి ఉన్నాయి. ఓటర్లకూ పట్టవు, రాజకీయ పార్టీలకూ పట్టవు.






> అహో మన మహాభారతం. అసెంబ్లీ నుంచి మొదలుకొని పార్లమెంట్ దాకా నేర చరితుల సంఖ్య దండిగానే ఉంటుంది. ఏ నేరం చేయని వాడైతే ఎన్నికలో గెలిచే అవకాశాలు 4.7 శాతమేనట. అదే నేరచరిత్ర గలఅభ్యర్థికి మాత్రం ఎన్నికల్లో గెలిచే అవకాశాలు 15.5 శాతమట. ఇదీ మన ఓటర్ల రీతి, నీతి. ఎవరు సిగ్గుపడాలి? ఎక్కడ సిగ్గుపడాలి? ఆ పార్టీ, ఈ పార్టీ అని కాదు, నేరగాళ్లకు టికెట్ ఇవ్వని పార్టీయే లేదు మన దేశంలో. ఆర్టికల్ 14 కింద అంతా సమానమే అంటే ఇదేనేమో.

> చిల్లర దొంగతనం చేసిన వారి కేసులను సత్వరం విచారణ చేయనవసరం లేదట. పాతికేండ్ల పడుచును మొగుడు మోసం చేస్తే విడాకుల కేసు వినడానికి 30 ఏండ్లు వాయిదా వేస్తే దేశానికి ఏమీ నష్టం లేదట. ఆమె రెండో పెండ్లి సంగతి దేశానికేం పట్టింది. కానీ, 43 శాతం ప్రజాప్రతినిధుల మీద ఉన్న తీవ్రనేరాలను త్వరగా విచారణ జరపకపోతే మనదేశ రాజ్యాంగ సంవిధాన సుపరిపాలనా వ్యవస్థ కుప్పకూలిపోతుందట.

కనుక సత్వర విచారణ హక్కును నేరగాళ్లయిన చట్టసభ్యులకు మాత్రమే తొలుత ఇస్తాం. అరవై ఏండ్లు దాటిన వాడికి ముందు కరోనా టీకా వేసినట్టు, లాక్‌డౌన్ మినహాయింపు సారా బ్రాందీషాపులు తెరవడంతో మొదలైనట్టు, ముందు ప్రజాప్రతినిధులపై ప్రత్యేక కోర్టులు రోజువారీ కేసులు విని వారికి ఆర్టికల్ 21 కింద సత్వర న్యాయం హక్కును అందేట్టు చూస్తారు. ఇతర కోట్లాది నేరస్తులకు సత్వర నిర్ధారణ హక్కుకు తొందరెందుకండీ.

నిజంగా సుప్రీంకోర్టు కనుసన్నల్లో, హైకోర్టు ధర్మాసనం పర్యవేక్షణలో ప్రత్యేక కోర్టులన్నీ శరవేగంగా పనిచేసి, తమ మీద తమ కేసులను తామే ఉపసంహరించుకోకుండా హైకోర్టు కొరడా పట్టుకుని చూస్తుండగా, లోకసభలో 233 మందితో పాటు అనేకానేక శాసనసభల్లో వేలాదిమంది ప్రజాప్రతినిధుల్లోని సగం మంది నేరగాళ్లే అని రుజువైపోయి జైళ్లకు వెళ్లిపోతే ఈ దేశం ఏమైపోతుంది? చట్టసభలన్నీ ఖాళీ అయిపోవూ. జైళ్లలో శీతాకాల సమావేశాలు జరుపుతారా? నేరం రుజువైతే జీవితకాలం నిషేధం విధించాలని అధికార పార్టీ నాయకుడొకాయన పిల్‌లో కోరుతున్నారు. అదే జరిగితే రాజకీయ పార్టీల గతేమిటి? కొత్త నేరగాళ్లు తొందరగా దొరుకుతారా? లేకపోతే ఎవరు పోటీచేస్తారు? కొంపదీసి మేం ఏ నేరమూ చేయలేదనే ప్రమాణ పత్రాలే వస్తాయా? అప్పుడు ఏడీఆర్ బతుకు ఎడారేనా? నేరగాళ్లకే ఓట్లేసే అలవాటున్న ఓటర్లంతా ఏమైపోవాలి? ఓ అమృత వత్సర స్వతంత్ర భారతదేశమా చెప్పు. అచ్చమైన జనంతో స్వచ్ఛమైన భారతం ఎప్పుడొస్తుందో.

---





## ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే

మరికొద్ది రోజుల్లో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వివాదాస్పద అంశాలను తెరపైకి తీసుకురావడం బీజేపీకి అలవాటే. అందుకే ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) గురించి ఆ పార్టీ ప్రస్తావిస్తున్నది. నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు దాన్ని అమలు కానివ్వను.

\- మమతా బెనర్జీ,
పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

